సాక్షి రంగారెడ్డి
శుక్రవారం ၊ 21 ၊ ఫిబ్రవరి ၊ 2025



దైవచింతనతో ప్రశాంతత

దైవ చింతన కలిగి ఉంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. 8లో▸



డిమాండ్ల సాధనకు కృషి

డిమాండ్ల సాధనకు బీసీలందరూ ఐక్యంగా ముందుకు సాగాలని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ సూచించారు. 8లో▸



బెల్టు షాపులపై పంజా

నిషేధిత గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్య హెచ్చరించారు. 8లో▸

న్యూస్‌రీల్

సిరిపురం యాదయ్య త్యాగం వెలకట్టలేనిది

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి



నాగారంలో యాదయ్య సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఆత్మబలిదానం చేసిన సిరిపురం యాదయ్య త్యాగం వెలకట్టలేనిదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పేర్కొన్నారు. గురువారం యాదయ్య వర్ధంతి సందర్భంగా ఆయన స్వగ్రామమైన నాగారంలోని సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 21 ఏళ్ల వయసులో తెలంగాణ సాధన కోసం ఉస్మానియా యూనివర్సిటీలో ఒంటిపై కిరోసిన్ పోసుకొని ప్రాణత్యాగం చేసుకున్న యాదయ్య ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఆయన మహేశ్వరంవాసి కావడం ఈప్రాంతానికి గర్వకారణమన్నారు. తెలంగాణ కోసం మరణించిన అమరుల కుటుంబాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం గుర్తించి ఆదుకుందన్నారు. అమరుడైన యాదయ్య ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యాదయ్య కుటుంబ సభ్యులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

23న గురుకులాల ప్రవేశ పరీక్ష

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల ప్రవేశ పరీక్షను ఈ నెల 23న నిర్వహిస్తున్నట్లు ఇబ్రహీంపట్నం బాలుర గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ మర్సి వరూధిని గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆదివారం టీజీ సెట్ 5వ తరగతిలో చేరడానికి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మొత్తం 651 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారన్నారు. ఇందు కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు రెండు గంటలు ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. హాల్ టికెట్‌తో పాటు ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు. హాల్‌టికెట్‌లో ఏవైనా తప్పులు ఉంటే పాఠశాల నుంచి బోనఫైడ్ సర్టిఫికెట్ తీసుకు రావాలని ఆమె పేర్కొన్నారు.

కులగణన రీ సర్వేకు సహకరించండి

బీసీ కమిషన్ సభ్యుడు జయప్రకాశ్



నాయకులతో సమావేశమైన బీసీ కమిషన్ సభ్యుడు జయప్రకాశ్

హుడాకాంప్లెక్స్: కులగణన రీ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని బీసీ కమిషన్ సభ్యుడు రాపోలు జయప్రకాశ్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనలో పలు ఆరోపణలు వచ్చినందున తిరిగి సర్వే చేపట్టిన విషయం తెలిసిందే. ఈ మేరకు గురువారం ఆయన సరూర్‌నగర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వక్క లంక శ్రీనివాసరావు, పార్టీ సరూర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు శంకర్‌యాదవ్‌లతో సమావేశమై కులగణనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులగణనలో పాల్గొనని వారు ప్రస్తుతం రీ సర్వేలో తమ పేర్లను కులాల వారీగా నమోదు చేసుకోవాలన్నారు. కుల సంఘాల అభివృద్ధి, సంక్షేమానికి దోహదపడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్‌యాదవ్, శ్రీనివాస్, ధన్‌రాజ్‌గౌడ్, ఇమ్రాన్‌అలీ పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి భూముల పరిశీలన



వివరాలు అడిగి తెలుసుకుంటున్న శశాంక

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రభుత్వం నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణాల కోసం అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని మజీద్‌పూర్, పసుమాముల రెవెన్యూ గ్రామాల పరిధిలోని సర్కారీ భూములను గురువారం తెలంగాణ ఫ్లాషిప్ ప్రాజెక్ట్ కమిషనర్ శశాంక పరిశీలించారు. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, సర్వేయర్ జ్యోతి, ఆర్ఐలు నిజాముద్దీన్, ఇంద్రాణితో కలిసి మజీద్‌పూర్ సర్వేనంబర్ 224, పసుమాముల సర్వేనంబర్ 422లోని భూములను పరిశీలించి, వివరాలను తెలుసుకున్నారు.

కూలుతున్న కాపురాలు

ప్రతీఒక్కరి జీవితంలో వివాహం ఓ మధుర ఘట్టం. భవిష్యత్‌పై ఎన్నో ఆశలు పెట్టుకుని సంసార సాగరంలోకి అడుగేస్తారు నూతన దంపతులు. ఈ క్రమంలో తలెత్తే చిన్నపాటి స్పర్థలకే కొంతమంది బంగారం లాంటి బంధాన్ని తెంచుకుంటున్నారు. భార్యాభర్తల మధ్య సఖ్యత లోపించి, సమాజంలో విడాకుల ధోరణి విపరీతమవుతోంది.



- చిన్నపాటి మనస్పర్థలకే తెగిపోతున్న బంధాలు
- అకారణ వివాదాలతో ఆగమవుతున్న జంటలు
- సరూర్‌నగర్ మహిళా పీఎస్‌లో ఏటా పెరుగుతున్న కేసులు
- సర్దుబాటు ధోరణి నశించడమే కారణమంటున్న నిపుణులు

హుడాకాంప్లెక్స్: భార్యాభర్తల మధ్య చిన్నపాటి గొడవలు చినికిచినికి గాలివానలా మారుతున్నాయి. నాలుగు గోడల మధ్య పరిష్కరించుకోవాల్సిన సమస్యలు చివరకు పోలీసు స్టేషన్లకు చేరుతున్నాయి. నువ్వెంత..? అంటే నువ్వెంత..? అనే అహంకార వలలో చిక్కి చివరకు విడిపోయేందుకు సిద్ధమవుతున్నారు. ఫలితంగా 2024 డిసెంబర్ నాటికి సరూర్‌నగర్ మహిళా పోలీస్ స్టేషన్‌లో 2,200 గృహహింస, అత్యాచారం, అదనపు కట్నం వేధింపుల ఫిర్యాదులు అందగా, వీటిలో 540 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.

పంతాలు, పట్టింపులు

పంతాలు, పట్టింపులకు పోయి.. ఠాణాకు వస్తున్న జంటలకు పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. 2024లో మహేశ్వరం జోన్‌లో 301, ఎల్బీనగర్‌జోన్‌లో 1,325, మల్కాజ్‌గిరి జోన్‌లో 1,513 మంది దంపతులకు ఫ్యామిలీ కౌన్సెలింగ్స్ నిర్వహించారు. సాధ్యమైనంత వరకు వారికి నచ్చజెప్పి.. ఒకటి చేసే ప్రయత్నం చేస్తున్నారు. అప్పటికే రెండు కుటుంబాల మధ్య వివాదం తార స్థాయికి చేరుకోవడం విడాకులకు కారణమవుతోంది. ఫలితంగా కోర్టుల్లో ఈ తరహా కేసుల జాబితా ఏటా పెరుగుతోంది. గత డిసెంబర్ వరకు ఎల్బీనగర్ ఫ్యామిలీ కోర్టు పరిధిలో 314 కేసులు, అడిషినల్ ఫ్యామిలీ కోర్టులో 353 కేసులు, కూకట్‌పల్లి ఫ్యామిలీ కోర్టులో 163 కేసులు పెండింగ్‌లో ఉండటం గమనార్హం.

- వనస్థలిపురానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మమతకు ఎల్బీనగర్‌కు చెందిన ఐటీ ఉద్యోగి శేఖర్‌తో ఏడాది క్రితం వివాహమైంది. భర్త తనను తరచూ వేధిస్తున్నాడని, ఇకపై ఆయనతో కలిసి ఉండలేనని పేర్కొంటూ ఇటీవల ఆమె సరూర్‌నగర్ మహిళా పోలీస్ స్టేషన్ మెట్లెక్కింది. చిన్న అంశంపై నెలకొన్న మనస్పర్థలు చివరకు విడాకుల వరకు దారి తీశాయి.
- మీర్‌పేటకు చెందిన అరుణ.. అదే ప్రాంతానికి చెందిన శ్రవణ్‌కుమార్‌తో రెండేళ్ల క్రితం పెళ్లైంది. వీరికి ఓ పాప ఉంది. అదనపు కట్నం కావాలని భర్త వేధిస్తుండటంతో భార్య పోలీసులను ఆశ్రయించింది. కులపెద్దలు, నిపుణులు కౌన్సెలింగ్ ఇచ్చినా ఇద్దరిలో ఎలాంటి మార్పు రాలేదు. చివరకు ఈ పంచాయితీ విడాకుల వరకు వెళ్లింది. ఇలా మమత, అరుణ దంపతులు మాత్రమే కాదు. అనేక మంది చిన్నచిన్న విషయాలకే కోర్టు మెట్లెక్కి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు.

రాచకొండ కమిషనరేట్ పరిధిలో కేసులు ఇలా

	2023	2024
వరకట్నం	16	18
గృహ హింస	1582	1222
పోక్సో	317	392
అత్యాచారాలు	327	384

ప్రధాన కారణాలివే..

- భార్యాభర్తలిద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే కావడం, భర్త ఒక షిఫ్ట్‌లో పని చేస్తే.. భార్య మరో షిఫ్ట్‌లో పని చేస్తుండటం, దీంతో ఇరువురూ కలిసి గడిపే సమయం దొరకకపోవడం.
- స్మార్ట్ ఫోన్లలో ఇతరులతో చాటింగ్‌లు, వీడియో కాల్స్ చేస్తుండటం.
- సంపాదన లేదా జీతంలో కొంత మొత్తాన్ని తమ తల్లిదండ్రులకు పంపుతామని ఒకరంటే.. పంపేది లేదంటూ మరొకరు గొడవకు దిగడం.
- ఒకరి తల్లిదండ్రులను మరొకరు సూటిపోటి మాటలతో విమర్శించడం.

అభిప్రాయ బేధాలు

- కొంత మంది అత్తామామలు అదనపు కట్నం పేరుతో తరచూ వేధింపులకు గురిచేయడంతో దంపతుల మధ్య వివాదాలు చెలరేగుతున్నాయి. పిల్లలను పాఠశాలలో చేర్పించే విషయంలోనూ ఇద్దరి మధ్య అభిప్రాయ బేధాలు తలెత్తుతున్నాయి.
- భార్య ఏటీఎం కార్డులు తన వద్దే ఉండాలన్న భర్త వాదన కూడా కాపురాలు కూలిపోతుండటానికి కారణమవుతోంది. మెజార్టీ కేసుల్లో ఆర్థికంగా ఎలాంటి సమస్యలు లేకపోయినా కేవలం పంతాలు, పట్టింపులే ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి.



– వేణుకుమార్, అడ్వకేట్



చేవెళ్ల మార్కెట్‌లో అమ్మకానికి వచ్చిన టమాటా



దేవునిఎర్రవల్లిలో పొలంలో వదిలేసిన టమాటా పంట

టమాటా.. నష్టాల బాట!

- రెండు నెలలుగా మార్కెట్‌లో తగ్గిన ధరలు
- కిలో రూ.2 నుంచి రూ.6 మాత్రమే
- పెట్టుబడులు సైతం రావడం లేదని రైతుల ఆవేదన

చేవెళ్ల: ఆరుగాలం శ్రమించి మట్టి నుంచి సిరులు పండించే అన్నదాతలకు ధరల రూపంలో శరాఘాతం తప్పడం లేదు. ముఖ్యంగా టమాటా పండించే రైతులకు మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లేక నష్టాలను చవిచూస్తున్నారు. దాదాపు రెండు నెలలుగా మార్కెట్‌లో ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో రైతులకు పెట్టుబడులు కూడా రావటం లేదని వాపోతున్నారు. మార్కెట్‌లో అన్నదాతలకు కిలో రూ.2 నుంచి రూ.6 మించి పలకడం లేదు. ఈ ధరలతో లాభాల సంగతి దేవుడెరుగు కనీసం పెట్టుబడులైన మిగిలితే చాలని కర్షకులు భావిస్తున్నారు. పంట దిగుబడులు వచ్చిన రైతులు వాటిని పొలంలోనే తెంపకుండా వదిలేసి నిస్సహాయస్థితిలో కూరుకుపోతున్నారు.

మూడు వేల ఎకరాల్లో సాగు

జిల్లాలో దాదాపు 3 వేలకుపైగా ఎకరాల్లో రైతులు టమాటా సాగు చేస్తున్నారు. రెండు నెలలుగా మార్కెట్‌లో ధరలు తక్కువగా పలుకుతున్నాయి. అప్పుడప్పుడు ఒకట్రెండు రోజులు కాస్త పెరిగినట్లు కనిపించినా మళ్లీ తగ్గుదల కొనసాగుతుంది. మార్కెట్‌కు రైతులు తీసుకు వచ్చిన 25 కిలోల టమాటా బాక్స్ ధర రూ.50 నుంచి రూ.150 వరకు ఉంది. ఈ ధరలతో తమకు గిట్టుబాటు కావడం లేదని కర్షకులు వాపోతున్నారు. ఈ ధరలతో నష్టాలే తప్ప లాభాలు లేవంటున్నారు. ఒక్కోసారి ఆకాశాన్నంటే ధరలు ప్రస్తుతం కనిష్ఠం కూడా లేకపోవటం బాధాకరమని ఆవేదన చెందుతున్నారు. ఏపీలోని చిత్తూరు మదనపల్లి నుంచి టమాటా దిగుబడులు పెద్ద మొత్తంలో వస్తుండటంతో ఇక్కడ ధరల తగ్గుదల ఉందని మార్కెట్ వ్యాపారులు చెబుతున్నారు. ప్రభుత్వం కనీస మద్దతు ధర కల్పించి రైతులకు ఆదుకోవాలని కోరుతున్నారు.

నష్టపోయిన రైతులు



మార్కెట్‌లో టమాటా ధరలు ఎప్పుడైతే బాగుంటాయో అప్పుడే ఇతర కూరగాయలకు డిమాండ్ ఉంటుంది. మంచి ధరలు వస్తాయి. చేవెళ్ల మార్కెట్‌లోకి ఎక్కువగా టమాటా రైతులు వస్తుంటారు. రెండు నెలలుగా ధరలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. బాక్స్ ధర రూ.50 నుంచి రూ.150 వరకు అమ్ముడు పోయింది. దీంతో రైతులు నష్టపోయారు.

– రాఘవేందర్‌గుప్తా, మార్కెట్ ఏజెంట్, చేవెళ్ల

పెట్టుబడులు రాలేదు



ఎకరం పొలంలో టమాటా సాగు చేశాను. కూలీ, రవాణా ఖర్చులు అధికమయ్యాయి. ప్రస్తుతం ధరలు లేక పొలంలోనే వదిలేస్తున్నాం. దీంతో పంట ఎండిపోతుంది. నెలరోజులుగా ధరలు పెరుగుతాయని చూసినా ప్రయోజనం లేదు. పెట్టుబడులు కూడా రావటం లేదు. తమని ప్రభుత్వమే ఆదుకోవాలి.

– విఠలయ్య, రైతు, ఆలూరు

'ఉపాధి'ని వినియోగించుకోండి



మొక్కల పెంపకంపై అధికారులకు సూచనలు ఇస్తున్న డీఆర్డీఏ పీడీ శ్రీలత

- డీఆర్డీఏ పీడీ శ్రీలత
- పథకం కింద చేపట్టిన పనుల పరిశీలన

కేశంపేట: గ్రామీణ ప్రాంతాల్లో కూలీలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఏ పీడీ శ్రీలత సూచించారు. గురువారం మండల పరిధిలోని సంతాపూర్, బోధునంపల్లి, చౌలపల్లి, నిర్దవెల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన నర్సరీలు, ఫార్మేషన్ రోడ్డు పనులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ఉపాధి పనుల్లో కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. నిబంధనల ప్రకారం పనిచేస్తే రోజు కూలీ రూ.300 పొందే అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న వన మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన మొక్కలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆమె వెంట ఏపీడీ శ్రీచరణ్, జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ సంధ్య, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీఓ కిష్టయ్య, ఏపీఓ అజీజ్, టీఏ నిలకంఠబాబు తదితరులు ఉన్నారు. అంతకుముందు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన 'ఆరోగ్యం- పోషకాహారం' శిక్షణ సదస్సులో పీడీ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం(ఐబీ) స్వర్ణలత, ఏపీఎం భగవంతు, మండల మహిళా సమాఖ్య కార్యదర్శి సుగుణ తదితరులు పాల్గొన్నారు.



పోలీసు కస్టడీలో వీర రాఘవరెడ్డి

యాప్రాల్‌లో దాడికి కుట్ర

దుష్ట శిక్షణ.. శిష్ట రక్షణ కోసం పనిచేయాలని ప్రతిజ్ఞ

- రామరాజ్య స్థాపనకు సహకరించని వారిని అడ్డు తొలగించాలని దిశానిర్దేశం
- పోలీసుల విచారణలో వెల్లడించిన వీర రాఘవరెడ్డి?
- ముగిసిన మూడు రోజుల కస్టడీ
- నేడు కోర్టులో హాజరుపర్చనున్న పోలీసులు

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేసి, కస్టడీలో ఉన్న వీర రాఘవరెడ్డి విచారణ ముగిసింది. దాడికి సంబంధించిన కీలక విషయాలను పోలీసులు ఆయననుంచి రాబట్టే ప్రయత్నం చేశారు. 14 రోజుల జుడీషియల్ రిమాండ్‌లో ఉన్న నిందితుడిని కోర్టు అనుమతితో పోలీసులు మూడు రోజుల కస్టడీకి తీసుకున్న విషయం తెలిసిందే. విచారణ చివరిరోజైన గురువారం ఉదయం మొయినాబాద్ పోలీస్ స్టేషన్ నుంచి వీర రాఘవరెడ్డిని నగరంలోని యాప్రాల్‌కు తీసుకెళ్లారు. రంగరాజన్‌పై దాడికి ముందు రెండు రోజులపాటు రామరాజ్యం సైన్యంతో యాప్రాల్‌లోని ఓ ఇంట్లో వీర రాఘవరెడ్డి సమావేశం నిర్వహించాడు. అక్కడే దాడికి కుట్ర జరిగిందనే విషయాలను నిందితుడి నుంచి రాబట్టారు. రెండు రోజుల సమావేశంలో ఏయే అంశాలపై చర్చ జరిగింది? అనే విషయాన్ని పోలీసులు ఆరా తీశారు. రామరాజ్య స్థాపనలో దుష్ట శిక్షణ శిష్ట రక్షణకోసం పనిచేయాలని.. అందుకు సహకరించనివారి అడ్డు తొలగించుకోవాలని వీరరాఘవరెడ్డి సైన్యంతో ప్రతిజ్ఞ చేయించినట్లు సమాచారం. అక్కడి నుంచి నిందితుడిని మణికొండలోని తన నివాసానికి తీసుకెళ్లి పరిశీలించారు. ఇంట్లో పోలీసులకు కొన్ని ఆధారాలు లభించాయి. అనంతరం రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయానికి తరలించారు. డీసీపీ శ్రీనివాస్, వీర రాఘవరెడ్డిని పలు ప్రశ్నలు అడిగి కీలక విషయాలను రాబట్టారు. చిలుకూరు బాలాజీ దేవాలయానికి వచ్చి రంగరాజన్‌పై దాడి చేయడానికి ముందు ఏం జరిగిందనే విషయాలను తెలుసుకున్నారు. మూడు రోజుల విచారణలో తెలుసుకున్న కీలక విషయాలతో నివేదిక రూపొందించారు. గురువారం కస్టడీ ముగిసిన నేపథ్యంలో శుక్రవారం అతన్ని కోర్టులో హాజరుపర్చనున్నారు. ఇందుకు సంబంధించిన నివేదికను సైతం శుక్రవారం కోర్టులో సమర్పించనున్నారు.

పరికి చెరువు ప్రాంతంలో హైడ్రా కూల్చివేతలు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి మండల పరిధిలోని ఆల్విన్ కాలనీ డివిజన్ భూదేవి హిల్స్ పరికి చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు గురువారం కూల్చివేశారు. ఈ క్రమంలో హైడ్రాలో జేసీబీని నడిపే ఓ ఉద్యోగి నిర్మాణంలో ఉన్న తన ఇంటిని తానే కూల్చివేసుకోవడం గమనార్హం. తనకు చెందిన ఇంటి స్లాబ్ నిర్మాణాన్ని వదిలివేయాలని అతడు అధికారులను బతిమిలాడినా వారు ససేమిరా అన్నారు. చెరువులు, ప్రభుత్వ భూములు, నాలాల వెంట కొనుగోలు చేసే ముందు ఒకటికి రెండు సార్లు ఆలోచించి కొనుగోలు చేసుకోవాలని, కష్టపడిన సొమ్మును వృథా చేసుకోరాదని అతడికి వారు సూచించారు. హైడ్రా సిబ్బంది అయినా, రాజకీయ నాయకులైనా, కబ్జాదారులైనా, ప్రభుత్వ భూములు, చెరువు స్థలాలు, నాలా పరిసర ప్రాంత స్థలాలను కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సంబంధిత హైడ్రా అధికారులు స్పష్టం చేశారు. కాగా.. అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నారనే విషయం తెలియడంతో స్థానికులు ఆ ప్రాంతానికి పెద్ద ఎత్తున వచ్చి అడ్డుకోవడానికి యత్నించారు. దీంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేశామని, ఇల్లు కట్టుకుంటున్న తరుణంలో కూల్చివేయటమేంటని బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు.



జేసీబీ డ్రైవర్‌కు నచ్చచెబుతున్న పోలీస్ అధికారి

'చలో విద్యుత్ సౌధ' భగ్నం



సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఆర్టిజన్ కార్మికులను విద్యార్హతను బట్టి కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ గురువారం చేపట్టిన చలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా విద్యుత్ సౌధ సహా ఖైరతాబాద్, పంజాగుట్ట సర్కిళ్లలో పోలీసులు భారీ సంఖ్యలో మోహరించారు. ఇతర జిల్లాల నుంచి నగరానికి చేరుకుంటున్న వాహనాలను ఎక్కడికక్కడే అడ్డుకుని కార్మికులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కళ్లుగప్పి విద్యుత్ సౌధ ముందుకు చేరుకున్న జేఏసీ చైర్మన్ ఈశ్వర్‌రావును అరెస్ట్ చేయగా, కన్వీనర్ వజీర్‌ను ఎర్రగడ్డలో అదుపులోకి తీసుకున్నారు. జేఏసీ కో కన్వీనర్ గాంబో నాగరాజు సహా ఇతర ప్రతినిధులు సదానందం, నరేందర్, ఎల్లయ్యలను ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ భవన్ ఎదుట అదుపులోకి తీసుకున్నారు.

స్క్రాప్ మాటున గంజాయి రవాణా

- అరకు నుంచి పూణేకు తరలింపు
- 300 కేజీల గంజాయి స్వాధీనం
- డీసీఎం డ్రైవర్ అరెస్ట్

అబ్దుల్లాపూర్‌మెట్/నాగోలు: ఎవరికీ అనుమానం రాకుండా కంటైనర్‌లో స్క్రాప్ మెటీరియల్ మధ్య గంజాయి దాచి అరకు నుంచి మహారాష్ట్రకు అక్రమ రవాణా చేస్తున్న డీసీఎం డ్రైవర్‌ను అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు, ఎస్ఓటీ మహేశ్వరం జోన్ పోలీసులు గురువారం అరెస్టు చేసిన అతడి నుంచి 300 కిలోల గంజాయి, కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం ఎల్బీనగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాచకొండ సీపీ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. మహారాష్ట్ర, పూణే, రూపినగర్‌కు చెందిన అహ్మద్ గులాబ్ షేక్ డీసీఎం డ్రైవర్‌గా పని చేసేవాడు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అతను సులువుగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో అతడికి అదే ప్రాంతానికి చెందిన వైభవ్, దేవాతో పరిచయం ఏర్పడింది. మాదకద్రవ్యాల దందా నిర్వహించే వారు తమ వద్ద డ్రైవర్‌గా పని చేయాలని అహ్మద్ గులాబ్ షేక్‌కు సూచించారు. ఏపీలోని విశాఖపట్నం నుంచి పూణే, మహారాష్ట్ర, తదితర ప్రాంతాలకు గంజాయి తరలిస్తే ఒక్కో లోడ్‌కు రూ.3 లక్షలు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. అందుకు అంగీకరించిన అతను గతంలో విశాఖపట్నం నుంచి పూణేకు రెండు లోడ్‌ల గంజాయిని విజయవంతంగా డెలివరీ చేసి వైభవ్‌కు అప్పగించాడు. దానిని వైభవ్, దేవా పూణేలోని తమ ఏజెంట్లకు సరఫరా చేశారు. వైభవ్, దేవా సూచన మేరకు నిందితుడు అహ్మద్ గులాబ్ షేక్ ఇటీవల విశాఖపట్నం వెళ్లి బుజ్జిబాబు అనే వ్యక్తి నుంచి 300 కిలోల గంజాయి (138) ప్యాకెట్లు) సేకరించాడు. తనిఖీల సమయంలో పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు కంటైనర్‌లో ప్లాస్టిక్ స్క్రాప్‌లోడ్ చేసి దాని కింద గంజాయి దాచి హైదరాబాద్ మీదుగా పూణేకు తరలిస్తున్నాడు. దీనిపై సమాచారం అందడంతో ఎస్ఓటీ మహేశ్వరం జోన్ పోలీసులు, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు గురువారం మధ్యాహ్నం రామోజీ ఫిల్మ్ సిటీ సమీపంలో కంటైనర్‌ను ఆపి సోదా చేయగా గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు అతడి నుంచి గంజాయి, టాటా కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.1.5 కోట్లు ఉండవచ్చునని సీపీ పేర్కొన్నారు. ఈ కేసులో మిగిలిన నిందితులను పట్టుకునేందుకు ఎస్ఓటీ, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎల్బీనగర్, మహేశ్వరం అదనపు డీసీపీ ఎండీ షకీర్ హుస్సేన్, అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కంటైనర్‌ను పరిశీలిస్తున్న సీపీ సుధీర్‌బాబు

కృత్రిమ ఇసుక తయారీదారుల రిమాండ్

కడ్తాల్: కృత్రిమంగా ఇసుక తయారు చేస్తున్న నలుగురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని సీఐ శివప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి ముద్వీన్ గ్రామ సమీపంలో గల వాగు నుంచి మట్టిని తీసి, కృత్రిమ ఇసుకను తయారు చేస్తున్నారన్న సమాచారంతో ఈ నెల 14న ఇసుక ఫిల్టర్లపై పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో నిర్వాహకులు మహేశ్, శ్రీశైలం, శేఖర్, జంగయ్య పరారవ్వగా.. జేసీబీతో పాటు, ఐదు మోటార్లు, ఐదు స్టార్టర్ బాక్స్‌లు, పదిబోరు పైపులు, నాలుగు చొప్పున ఇసుక, మట్టి దిబ్బలను సీజ్ చేశారు. గురువారం విశ్వసనీయ సమాచారం మేరకు ముద్వీన్‌లో పోలీసులు తనిఖీలు చేపట్టగా.. పరారీలో ఉన్న నిందితులు పట్టుబడ్డారు. ఈ మేరకు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. అనుమతులు లేకుండా ఇసుక తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

కారు బోల్తా, ఇద్దరికి గాయాలు


ప్రమాద స్థలంలో కారు

యాచారం: ఓ కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ సంఘటన గురువారం మధ్యాహ్నం నాగార్జునసాగర్– హైదరాబాద్ రహదారిపై చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నగరానికి చెందిన ఓ కుటుంబ సభ్యులు, మాల్‌లో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. తిరిగి నగరానికి వస్తున్న క్రమంలో వారు ప్రయాణిస్తున్న కారు.. అతి వేగంతో అదుపుతప్పి చింతపట్ల గేట్ సమీపంలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

కడ్తాల్: శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై మండల కేంద్రం సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి(50) గురువారం రాత్రి ఏడున్నరకు ముచ్చర్ల గేట్ నుంచి కడ్తాల్ వైపు జాతీయ రహదారిపై నడుచుకుంటూ వస్తున్నాడు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వైపు వెళుతున్న ద్విచక్ర వాహనం ఆయన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ద్విచక్ర వాహనంపై ఉన్న నాగర్‌కర్నూల్ జిల్లా బండోనిపల్లికి చెందిన చీమర్ల జగన్ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ వరప్రసాద్ పేర్కొన్నారు.

స్టూడెంట్ వీసాపై వచ్చి డ్రగ్స్ దందా

- మియాపూర్‌లో 60 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం
- బెంగళూర్‌కు చెందిన కార్పొరేట్ ఉద్యోగిని శతాబ్ది మన్నా అరెస్ట్
- అంతర్జాతీయ డ్రగ్ పెడ్లర్ వారెన్ కొకరంగో పరారీ



టీ న్యాబ్ ఎస్పీ సాయి చైతన్యతో కలిసి వివరాలను వెల్లడిస్తున్న మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్

గచ్చిబౌలి: కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ అంతర్రాష్ట్ర డ్రగ్ పెడ్లర్‌గా మారిన ఓ యువతిని అదుపులోకి తీసుకున్న యాంటీ నార్కొటిక్ బ్యూరో(టీ న్యాబ్), మియాపూర్ పోలీసులు ఆమె నుంచి 60 గ్రాముల సింథటిక్ ఎండీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలు శతాబ్ది మన్నా(24) అరెస్ట్ చేశామని, మరో అంతర్జాతీయ డ్రగ్ పెడ్లర్ వారెన్ కొకరంగో పరారీలో ఉన్నాడు. గురువారం మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ డాక్టర్ వినీత్ వివరాలు వెల్లడించారు. డ్రగ్ పెడ్లర్ శతాబ్ది మన్నా బుధవారం సాయంత్రం మియాపూర్ బస్‌స్టాప్‌లో ఉన్నట్లు సమాచారం అందడంతో దాడి చేసిన పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని రూ.6 లక్షల విలువైన సింథటిక్ ఎండీఎంఏ డ్రగ్, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. జార్ఖండ్ రాష్ట్రం, జంషెడ్పూర్‌కు చెందిన మన్నా బెంగళూర్‌లో బీబీఏ పూర్తి చేసింది. అక్కడే ఆమెకు స్టూడెంట్ వీసాపై వచ్చిన ఆఫ్రికాకు చెందిన వారెన్ కొకరంగోతో పరిచయం ఏర్పడింది. బెంగళూరులోనే ఉంటూ వర్క్ ఫ్రం హోం విధులు నిర్వహిస్తున్న శతాబ్ది మన్నా తన గదిలోనే డ్రగ్స్ నిల్వ ఉంచి డ్రగ్ పెడ్లర్లకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ క్రమంలో పక్కా సమాచారంతో డ్రగ్స్ అందజేసేందుకు వచ్చిన మన్నాను అరెస్ట్ చేసినట్లు తెలిపారు., ఏదైనా పార్టీ లేదా పెడ్లర్లకు విక్రయించేందుకు ఆమె హైదరాబాద్‌కు వచ్చి ఉండవచ్చునన్నారు. మన్నా నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసే సబ్ పెడ్లర్‌ను గుర్తించామని, మరి కొందరిని గుర్తించాల్సి ఉందన్నారు. వీరు గోవా, బెంగళూర్, రాజస్తాన్, ముంబై నుంచి డ్రగ్స్ తీసుకొస్తున్నట్లు సమాచారం ఉందని ఈ డ్రగ్ చైన్‌ను త్వరలోనే ఛేదిస్తామన్నారు. మరో నిందితుడు వారెన్ కొకరంగోకు అంతర్జాతీయ డ్రగ్ నెట్‌వర్క్‌లో ఉన్నాడని, పరారీలో ఉన్న అతడిని త్వరలోనే పట్టుకుంటామన్నారు. డ్రగ్ పెడ్లర్లు జార్ఖండ్‌లో పేదరికంలో ఉన్న విద్యార్థులకు డబ్బు ఆశ చూపి ఈ దందాలోకి దించుతున్నట్లు తాము గుర్తించామన్నారు. టీ న్యాబ్ ఎస్పీ సాయి చైతన్య మాట్లాడుతూ డ్రగ్ ఫ్రీ తెలంగాణకు ప్రజలు సహకరించాలన్నారు. గత అక్టోబర్‌లో అబిడ్స్, అఫ్జల్‌గంజ్, చౌటుప్పల్ పీఎస్‌ల పరిధిలో రాజస్తాన్ గ్యాంగ్ నుంచి 350 గ్రాముల ఎండీఎంఏ, డిసెంబర్ 25న ఫిల్మ్‌నగర్ పీఎస్ పరిధిలో 17.38 గ్రాముల ఎండీఎంఏ, పేట్ బషీరాబాద్ పీఎస్ పరిధిలో ఫిబ్రవరి 11న ఇద్దరు రాజస్తాన్ పెడ్లర్ల నుంచి 40 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. సమావేశంలో మాదాపూర్ ఏడీసీపీ జయరాం, టి న్యాబ్ డీఎస్పీ హరిచంద్రా రెడ్డి, మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు విజయభాస్కర్ రెడ్డి, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై పోలీసు పంజా


కొందుర్గులో పట్టుబడిన మద్యం బాటిళ్లను చూపుతున్న పోలీసులు

- మద్యం, నిషేధిత గుట్కాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్య

కొందుర్గు: నిషేధిత గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్య హెచ్చరించారు. గురువారం సాయంత్రం ఆయన ఆధ్వర్యంలో మండల కేంద్రంలో 50 మంది పోలీసులు ఏక కాలంలో వివిధ దుకాణాలపై దాడులు చేశారు. ఈ సందర్భంగా కిరాణ షాపుల్లో నిషేధిత గుట్కాలు, బెల్ట్ షాపులో మద్యం విక్రయిస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. ఆరు బెల్ట్ షాపుల్లో సోదాలు చేసి అనుమతులు లేకుండా విక్రయిస్తున్న లిక్కర్ బాటిళ్ల స్వాధీనం చేసుకొని వారిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. నాలుగు దుకాణాలపై రైడింగ్ చేసి నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా నడుపుతున్న 10 వాహనాలు సీజ్ చేసినట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అనుమతి లేకుండా ఇసుక రవాణా, మట్టి తవ్వకాలు జరిపినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సైలు రవీందర్ నాయక్, బాలస్వామి, విజయ్ పాల్గొన్నారు.

నుమాయిష్‌లో 247 మంది పోకిరీల పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: నాంపల్లిలో గత నెల 3 నుంచి ఈ నెల 17 వరకు జరిగిన నుమాయిష్‌పై డేగకన్ను వేసిన నగర షీ–టీమ్స్ 247 మంది పోకిరీలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నాయి. వీరిలో 37 మందిపై కేసులు నమోదు చేయగా... ఇద్దరికి న్యాయస్థానం శిక్ష విధించింది. మరో 33 మందికి రూ.1,050 చొప్పున, ఒకరికి రూ.50 జరిమానా, మరొకరి రెండు రోజుల సాధారణ జైలుతో పాటు జరిమానా విధించింది. మరో 20 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ 247 మంది పోకిరీల్లో 223 మంది మేజర్లు, 24 మంది మైనర్లు ఉన్నారు. ఈవ్‌టీజింగ్‌పై 100కు ఫోన్ చేసి లేదా 9490616555కు వాట్సాప్ చేసి సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరుతున్నారు.

1.2 కిలోల గంజాయి పట్టివేత

కారులో తరలిస్తుండగా పోలీసుల దాడులు

ఇబ్రహీంపట్నం రూరల్: గుట్టుచప్పుడు కాకుండా కారులో గంజాయి తరలిస్తుండగా పక్కా సమాచారంతో పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం తుమ్మనపేట్ గ్రామానికి చెందిన మహ్మద్ సమీర్(24) నగరంలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతడు గురువారం గణేష్ అనే వ్యక్తి వద్ద బీఎన్‌రెడ్డినగర్ ఎల్బీనగర్ మధ్యలో 1.2 కిలోల గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేశాడు. అక్కడి నుంచి రాగన్నగూడ సమీపంలో పాటి వద్ద ఉన్న తన రూమ్‌మేట్ వద్దకు కారులో వచ్చాడు. ఇద్దరూ కలిసి నగరంలో ఎక్కువ ధరకు గంజాయిని అమ్మేందుకు పథకం పన్నారు. ఈ క్రమంలో ఇరువురూ వెళ్తుండగా ఆదిబట్ల, నార్కోటిక్ పోలీసులకు సమాచారం రావడంతో కారును వెంబడించి పట్టుకున్నారు. సమీర్ వద్ద 1.2 కిలోల గంజాయి, కారు, మొబైల్ స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు. గతంలో సమీర్‌పై వివిధ పోలీస్‌స్టేషన్లలో 12 చోరీల కేసులు ఉన్నట్లు గుర్తించారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టిన అనంతరం రిమాండ్‌కు తరలిస్తామన్నారు. సమీర్‌కు గంజాయి విక్రయించిన గణేష్ పరారీలో ఉన్నట్లు చెప్పారు.

ఉపాధిహామీ పనులు ప్రారంభించండి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య


మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

షాద్‌నగర్‌రూరల్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను జిల్లా వ్యాప్తంగా వెంటనే ప్రారంభించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య కోరారు. గురువారం పట్టణంలోని వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ పనులు లేకపోవడంతో కూలీలు ఖాళీగా ఉంటున్నారన్నారు. వేసవి ఎండలు తీవ్రంగా ఉండటంతో బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలకు పనులను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో చేసిన ఉపాధి పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలన్నారు. జాతీయ ఉపాధిహామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.86 వేల కోట్లను మాత్రమే కేటాయించిందన్నారు. ఈ పరిమితిని పెంచాలన్నారు. ఉపాధి కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా రోజూ రూ.700 ఇవ్వాలని, రెండు వందల రోజుల పని దినాలను కల్పించాలని డిమాండ్ చేశారు. టెంట్లు, మంచినీళ్లు, గడ్డపార, పార, రవాణా సౌకర్యం తదితర ఏర్పాట్లను ప్రభుత్వం కల్పించాలన్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, నాయకుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు సమష్టి కృషి


నియోజకవర్గ నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న కృష్ణ

జీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ

షాద్‌నగర్: డిమాండ్ల సాధనకు బీసీలందరూ ఐక్యంగా ముందుకు సాగాలని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ సూచించారు. గురువారం పట్టణంలోని ఓ హోటల్‌లో బీసీ సేన జిల్లా అధ్యక్షుడు పసుపుల ప్రశాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన బర్క కృష్ణ మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో బీసీలు మరింతగా రాణించాల్సిన అవసరం ఉందన్నారు. బీసీల ఐక్యత, సామాజిక న్యాయ సాధనకు తమ సంస్థ అహర్నిశలు కృషి చేస్తోందని తెలిపారు. హక్కుల పరిరక్షణకు అందరూ కలిసి కట్టుగా ముందుకు సాగుతూ డిమాండ్లను నెరవేర్చుకోవాలన్నారు. ముఖ్యంగా బీసీ యువత ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో రాణించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం బీసీ సేన నియోజకవర్గ అధ్యక్షుడిగా చంద్రశేఖరప్పను ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు బాబయ్య, సత్యం, లక్ష్మణ్, రాజు, చందులాల్, శంకరయ్య, జగదీష్ గౌడ్, మల్లేశ్‌గౌడ్, శివకుమార్, రవి, రాఘవేందర్, రమేశ్, వరప్రసాద్, చందు, సత్యం, హరీశ్‌కుమార్, నరేశ్, సాయి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో అనర్థాలు

ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి


యువకులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సుధాకర్

పహాడీషరీఫ్: నేరాల పట్ల అవగాహన పొంది వాటికి దూరంగా ఉండాలని మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి సూచించారు. బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బిస్మిల్లా కాలనీలో బుధవారం రాత్రి ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌తో ఆయన కలిసి విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా స్థానికులకు నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశానుసారం నిత్యం ఏదో ఒక బస్తీలో విజిబుల్ పోలీసింగ్ చేపట్టి ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. ముఖ్యంగా యువత డ్రగ్స్, గంజాయి లాంటి వాటికి బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. వాటితో కలిగే నష్టాలను ఈ సందర్భంగా వివరించారు. సైబర్ క్రైమ్స్ పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే ఆకర్షణీయమైన లింక్‌లను ఓపెన్ చేయరాదని సూచించారు. రహదారి నియమాలు పాటించి రోడ్డు ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్లు విరివిగా వాడుతూ దుష్ప్రభావాలకు లోనుకారాదన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులు నమ్మి శాంతి భద్రతల భంగం కలిగించేలా వ్యవహరించకూడదని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు యూసుఫ్ జానీ, శ్రీనివాసులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో గుర్తు తెలియని వృద్ధుడి మృతి


గుర్తు తెలియని మృతదేహం

ఇబ్రహీంపట్నం రూరల్: అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఎల్మినేడు గ్రామానికి చెందిన ఎక్కే శ్రీనివాస్ తన వ్యవసాయ పొలం వద్ద ఉండగా గుర్తు తెలియని వృద్ధుడు అనారోగ్యంతో బాధపడుతూ వచ్చాడు. శ్రీనివాస్ అతనితో మాట్లాడే ప్రయత్నం చేశాడు. నీరసంగా ఉన్నాడని చలించిన శ్రీనివాస్ ఆ వృద్ధుడికి టాబ్లెట్లు, భోజనం అందించాడు. అతని పొలంలోని గది వద్ద పెట్టి బాగోగులు చూసుకున్నాడు. అతని ఆరోగ్యం కుదుట పడకపోవడంతో మరింత నీరసంగా కనిపించగా 108కి ఫోన్ చేసి ఉస్మానియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మార్గమధ్యలోనే వృద్ధుడు మృతి చెందాడు. మరణించిన వ్యక్తి వయసు 65 ఏళ్లు ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని గుర్తుపట్టిన వారు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ 8712662419, 8712662361లో సంప్రదించాలని సీఐ జగదీష్ సూచించారు.

చెరువులో పడి యువకుడి దుర్మరణం


సూర్యదేవ్ మృతదేహం

కీసర: పుట్టిన రోజునాడే ప్రమాదవశాత్తు ఓ యువకుడు చెరువులో నీట మునిగి మృతి చెందిన సంఘటన గురువారం కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని యాద్గార్‌పల్లి గండిచెరువు వద్ద చోటు చేసుకుంది. కీసర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నం ప్రాంతానికి చెందిన శ్రీనివాస్ కుమారుడు సూర్యదేవ్(26) ఓ మెడికల్ ఏజెన్సీలో పని చేస్తున్నాడు. గురువారం తన పుట్టిన రోజు వేడుకలు జరుపుకునేందుకు బుధవారం హైదరాబాద్‌కు వచ్చిన అతను గచ్చిబౌలిలో ఉంటున్న తన చిన్ననాటి మిత్రులు దినేష్, కాలేషా, లోహిత్, తేజను కలిశాడు. అందరూ కలిసి బుధవారం రాత్రి గచ్చిబౌలిలో పార్టీ చేసుకున్న అనంతరం యాద్గార్‌పల్లి సమీపంలోని అండర్ దిమూన్ రిసార్ట్‌కు వచ్చారు. గురువారం తెల్లవారుజామున మద్యం మత్తులో ఈతకొట్టేందుకు చెరువులో దిగిన సూర్యదేవ్ నీటిలో గల్లంతయ్యాడు. స్నేహితుల సమాచారంతో సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కీసర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి
- కేశంపేటలో అంతర్రాష్ట్ర రెండెద్దుల బండలాగుడు పోటీలు

కేశంపేట: దైవ చింతన కలిగి ఉంటేనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అలివేలుమంగ సమేత శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అంతర్రాష్ట్ర రెండెద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేర్వేరుగా పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు పోటీలను తిలకించారు. అనంతరం గెలుపొందిన వారికి నిర్వాహకులు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... గ్రామస్తులు ఐకమత్యంగా వేడుకలు జరపడం ఆనందంగా ఉందన్నారు. పోటీల్లో మొదటి బహుమతి వైపీఆర్ బుల్స్, ఎల్చాల ప్రసన్నరెడ్డి, నాదర్‌గుల్(హైదరాబాద్), రెండో బహుమతి కుందురు రాంభూపాల్‌రెడ్డి, గంపరమన్నుదిన్నే(నంద్యాల), మూడో బహుమతి కేవీఆర్ బుల్స్, కటకం వెంకటేశ్వర్లు, ఇనిమెట్ల(పల్నాడు జిల్లా), నాలుగో బహుమతి షేక్ మహ్మద్, షేక్ ఫరీద్, బలికురవ(బాపట్ల జిల్లా), ఐదో బహుమతి పావులూరి వీరస్వామి చౌదరి, బలికురవ(బాపట్ల జిల్లా) ఎద్దులు పోటీల్లో ప్రతిభ చూపాయి. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, నాయకులు వీరేష్, వెంకట్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, జగదీశ్వర్, శ్రీధర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అద్దెకు తీసుకుని అమ్మేశాడు..

- ఘరానా మోసగాడి అరెస్ట్
- రూ.2.5 కోట్ల విలువైన 28 కార్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న వాహనాలు

జీడిమెట్ల: కార్లను లీజు ప్రాతిపదికన అద్దెకు తీసుకుని వాటిని అమ్మి సొమ్ము చేసుకుంటున్న వ్యక్తిని జగద్గిరిగుట్ట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్, ఏసీపీ హన్మంతరావు, జగద్గిరిగుట్ట సీఐ నర్సింహ, డీఐ అంజయ్యలతో కలిసి వివరాలు వెల్లడించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన అప్పరి విశ్వపణీంద్ర గాజులరామారం దేవేందర్‌నగర్‌లో ఉంటూ చివకల రమణ, రెడ్డి వెంకటేశ్‌లతో కలిసి వీవీఆర్ ట్రావెల్స్ పేరిట సంస్థను ఏర్పాటు చేశాడు. అతను జగద్గిరిగుట్టకు చెందిన శశిధర్ వద్ద 2024 అక్టోబర్‌లో నెలకు రూ.23 వేలు చెల్లించేలా లీజు ప్రాతిపదికన కారును అద్దెకు తీసుకున్నాడు. రెండు నెలలు సక్రమంగా అద్దె చెల్లించిన తర్వాత అద్దె చెల్లించకుండా కాలయాపన చేస్తున్నాడు. దీంతో అనుమానం వచ్చిన శశిధర్ అతడి కార్యాలయం వద్దకు వెళ్లి చూడగా తాళం వేసి ఉంది. దీంతో పరిసర ప్రాంతాల్లో విచారించగా అతను ఇదే తరహాలో మరికొందరిని మోసం చేసినట్లు తెలిసింది. శశిధర్ జగద్గిరిగుట్ట పోలీసులకు పిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు విశ్వపణీంద్రను అదుపులోకి తీసుకున్నారు.

32 కార్లు అమ్మేశాడు..

విశ్వపణీంద్ర ఇదే తరహాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 32 కార్లను అద్దెకు తీసుకుని విక్రయించినట్లు విచారణలో వెల్లడైంది. 28 కార్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు అతడికి సహకరించిన రమణ, సత్యనారాయణ, వెంకటేష్‌ల కోసం గాలిస్తున్నారు. నిందితుడు విశ్వపణీంద్రను గురువారం రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ నర్సింహ, డీఐ ఎం.అంజయ్య, ఎస్సై శంకర్, ఏఎస్సై రమణ, హెడ్‌కానిస్టేబుళ్లు అంజిబాబు, పురందాస్, కానిస్టేబుళ్లు నరేష్‌కుమార్, చిరంజీవి, నరేష్‌లను డీసీపీ అభినందించి రివార్డులను అందజేశారు.

నాంపల్లి కోర్టుకు ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ గైర్హాజరు

తదుపరి విచారణ మార్చి 20కి వాయిదా

సిటీ కోర్టులు : గత అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్‌పై కమలాపూర్ పోలీసులు నమోదు చేసిన కేసుపై గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణ జరిగింది. విచారణకు ఆయన గైర్హాజరు కావడంతో అతని తరుపు న్యాయవాది కుర్మ నరేందర్ 317 పిటిషన్ దాఖలు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్‌తోపాటు పలువురిపై కమలాపూర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసుపై విచారణ చేపట్టిన న్యాయస్థానం బల్మూర్ వెంకట్ గైర్హాజరు కావడంతో విచారణను మార్చి 20కి వాయిదా వేసింది.